కార్మికులకు సర్కారు భరోసా

- ఉపాధి హామీ కూలీలకు కార్మిక గుర్తింపు కార్డులు
- 18 నుంచి 60 ఏళ్లలోపు ఆసంఘటిత కార్మికులకు కూడా..

తాడిపత్రి టౌన్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చిన్న, పెద్ద కుటీర, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులతోపాటు ఉపాధి హామీ కింద 90 రోజులు పని చేసిన కూలీలందరికీ భవన నిర్మాణ కార్మికుడిగా గుర్తింపు కార్డు మంజూరు చేస్తోంది. తద్వారా వారికి సంక్షేమ పథకాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో ఆసంఘటిత రంగ కార్మికులతోపాటు ఉపాధి హామీ కూలీల్లో హర్షం వ్యక్తమవుతోంది. కార్మిక శాఖ నుంచి గుర్తింపు పొందిన కార్మికులకు అందే సంక్షేమ పథకాలపై కార్మిక శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

వేలాది మందికి గుర్తింపు..

మూడు జిల్లాలకు కేంద్రంగా తాడిపత్రి కార్మిక శాఖ కార్యాలయం ఉంది. ఈ ప్రాంతం సిమెంట్, స్టీల్ పరిశ్రమలతోపాటు గ్రానైట్, నల్లబండలు, ఊత కడ్డీలు, బీడీ పరిశ్రమలతోపాటు చిన్న,చిన్న కుటీర పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. దీంతో అన్నీ వర్గాలకు చెందిన కార్మికులు వేల సంఖ్యలో ఉంటున్నారు. కానీ 9210 మంది మాత్రమే భవన నిర్మాణ కార్మికులుగా గుర్తింపు కార్డులు పొందారు.


కార్మికులకు కార్మిక సభ్యత్వంపై అవగాహన కల్పిస్తున్న తాడిపత్రి సహాయ కార్మికశాఖ అధికారి ప్రతాప్‌నాయుడు

కార్మిక సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి ఇలా..

- భవన నిర్మాణ కుమార్తె, కార్మికురాలి వివాహ కానుక కింద రూ.20 వేల సాసాయం.
- మహిళా కార్మికురాలు /కార్మికుని భార్య, కార్మికుని కుమార్తెలకు ప్రసూతి సాయం కింద రూ.20 వేల సాయం
- కార్మికుడు / కార్మికురాలి సాధారణ మరణం పొందితే వారి కుటుంబానికి రూ.60 వేల పరిహారం
- కార్మికుడి దహన సంస్కార ఖర్చులకు రూ.20 వేల సాయం
- గుర్తింపు కార్డు పొందిన భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదశాత్తు మరణిస్తే రూ.5 లక్షల పరిహారం
- పని ప్రదేశంలో అంగవైకల్యం ఏర్పడితే రూ.5 లక్షల పరిహారం
- గుర్తింపు కార్డు లేకుండా పని చేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.50 వేల పరిహారం
- గుర్తింపు కార్డు లేకుండా పని చేస్తూ ప్రమాదవశాత్తు అంగవైకల్యం ఏర్పడితే రూ.20 వేలు
- గుర్తింపు కార్డు లేకుండా పని చేస్తూ 50 శాతం అంగవైకల్యం కల్గితే రూ.10 వేలు
- ప్రమాదభృతి కింద రోజుకు రూ.200 చొప్పున గరిష్ఠంగా 15 రోజుల పాటు రూ. 3 వేలు చొప్పున ఆర్థిక సాయం
- క్యాన్సర్, గుండె, ఊపిరితిత్తులు, మొదలగు టెర్మినల్ జబ్బులకు ఈ సాయం 3 నెలల వరకూ వర్తింపుజేయు అధికారం కార్మిక సంక్షేమ బోర్డుకు ఉంది.
- భవన, ఇతర నిర్మాణ కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇస్తారు.
- శిక్షణ కాలంలో రోజుకు రూ.300 చొప్పున స్టయిఫండ్ ఇస్తారు.

గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోండి



కార్మికులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అన్ని రంగాల్లో పని చేసే కార్మిలందరికీ అవగాహన కల్పించి గుర్తింపు కార్డులిస్తున్నాం. 18 నుంచి 60 ఏళ్లలోపు వివిధ రంగాల్లో పని చేసే కార్మికులందరూ కార్మిక గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ఉపాధి హామీ కింద 90 రోజులు పని చేసిన కూలీలకూ గుర్తింపు కార్డులు ఇస్తాం.

– ప్రతాప్‌నాయుడు, సహాయ కార్మికశాఖాధికారి, తాడిపత్రి

క్లుప్తంగా

వృద్ధుడిపై కుక్కదాడి

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో గురువారం కుక్క కరవడంతో ఓ వద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కృష్ణమూర్తి బయటకు వెళ్తుండగా ఇంటి సమీపంలో కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. బిగ్గరగా కేకలు వేయడంతో కుక్క అక్కడి నుంచి వెళ్లిపోయింది. కుక్క దాడిలో కృష్ణమూర్తి కుడి కాలు, పిక్కకు గాయాలయ్యాయి. అతడిని వెంటనే గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారం రోజుల్లో గ్రామంలో సుమారు 10 మంది వరకూ కుక్కల దాడిలో గాయపడ్డారని అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ మునివేలు

తాడిపత్రి టౌన్: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మునివేలు ప్రజలను కోరారు. స్థానిక కొత్త కూరగాయాల మార్కెట్టు వద్ద దాత టంగుటూరు సదాశివయ్య జ్యువెలర్స్ యజమాని కృష్ణమోహన్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం తహసీల్దార్ మునివేలు ప్రారంభించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్, వాసవీక్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్స్ భూమా సూర్యనారాయణ, శేషాఫణి , కో ఆర్డినేటర్ సుబ్బరామయ్య, సభ్యులు శ్యాం ప్రసాద్, చంద్రమౌళి, సుబ్బరత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై తిరగబడిన తాగుబోతులు

గుత్తి: పోలీసులపైనే తాగుబోతులు తిరగబడ్డ ఘటన గుత్తిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని సీఎస్ఐ చర్చి రోడ్డులో ఓ మహిళ దుకాణం పెట్టుకుంది. అర్ధరాత్రి సమయంలో సాయితో పాటు మరో ఇద్దరు యువకులు తప్ప తాగి ఆ మహిళ దుకాణం వద్దకు వెళ్లారు. ఆమెను నిద్ర లేపి సిగరెట్లు అడిగారు. ఈ సమయంలో తాను సిగరెట్లు అమ్మనని చెప్పింది. దీంతో ఆ మహిళను నానా దుర్భాషలాడారు. అంతటితో ఆగకుండా దాడికి ప్రయత్నించారు. దీంతో ఆ మహిళ పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఇద్దరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ యువకులు పోలీసులను సైతం నానా దుర్భాషలాడారు. అంతటితో ఆగకుండా పోలీసుల బైక్ తాళాలు తీసుకుని విసిరికొట్టారు. దీంతో పోలీసులు ఓ యువకున్ని అదుపులోకి తీసుకున్నారు.

పుప్పాలలో కంటి పరీక్షలు

యాడికి: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గురువారం పుప్పాల గ్రామంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా 25 మందికి పరీక్షలు నిర్వహింగా 10 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు కంటి వైద్య నిపుణుడు మధుసూదన్‌రాజు తెలిపారు. వీరికి ఈ నెల 27,28,29 తేదీలలో అనంతపురం శారదా నగర్‌లోని సంచార వైద్యశాలలో కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు.

ప్రమాద బాధితుల వివరాలు నమోదు చేయాలి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రమాదంలో గాయపడిన వారి వివరాలను ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్ డేటాబేస్ అప్లికేషన్ (ఐరాడ్)లో తప్పనిసరిగా నమోదు చేయాలని ప్రాజెక్టు మేనేజర్ సోమ్లానాయక్ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏపీ అల్లోపతి మెడికల్ కౌన్సిల్, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత కమిటీ చట్టం కింద ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు, ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సురేష్, డెమో భారతి, డిప్యూటీ డెమో త్యాగరాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 24వ వార్డులో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి వాటర్‌వర్క్స్ సిబ్బందికి సూచించారు. గురువారం వార్డులో పర్యటించిన నైరుతిరెడ్డి నూతనంగా ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరగా వెంటనే ట్రాన్స్‌కో అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. వార్డు ఇన్‌చార్జ్ జమీల్ తదితరులు పాల్గొన్నారు.


పైప్‌లైన్ మరమ్మతును పరిశీలిస్తున్న వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి

యోగాతో ఒత్తిడి అధిగమించొచ్చు

పామిడి: విద్యార్థులకు పరీక్షలు అంటే సహజంగా ఒత్తిడి ఉంటుందని, యోగాతో అధిగమించవచ్చని పామిడి ఆయుర్వేద వైద్యురాలు కృష్ణవేణి అన్నారు. గురువారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఆమె విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రాణాయామం వంటి కొన్ని యోగా ప్రక్రియల ద్వారా ఒత్తిడిని దూరం చేసుకోవచ్చునన్నారు. ఈసందర్భంగా యోగా ఫ్యాకల్టీ సంధ్యాదత్ విద్యార్థినీలచే యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో ఎస్ఓ సౌభాగ్యలక్ష్మి, ఏఎన్ఎం లక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.


విద్యార్థినిని పరీక్షిస్తు వైద్యురాలు కృష్ణవేణి

కేసు నమోదు

యాడికి: తన తండ్రికి క్షమాపణలు చెప్పాలని లేకపోతే అంతు చూస్తామంటూ బెదిరించిన ఇద్దరుపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కమలపాడు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ మండల కేంద్రంలో కుంటలో సెలూన్ షాపు నిర్వహించేవాడు. గత జనవరి 25న మండల కేంద్రానికి చెందిన జాఫర్, ఖాజా కులం పేరుతో లక్ష్మీనారాయణను దూషించి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కానీ అదే రోజు జాఫర్ కుమారులు జిలాన్, సయ్యద్ ఫోన్ చేసి లక్ష్మీనారాయణను బెదిరించటంతో వారిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తాడిపత్రి అర్బన్: పోరాట కాలనీకి చెందిన శ్రీరాములు అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు పట్టణ పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బుక్కరాయసముద్రం: రెడ్డిపల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. చెదుల్ల గ్రామానికి చెందిన సాయికుమార్ అనే యువకుడు సొంత పని మీద రెడ్డిపల్లికి వచ్చాడు. పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో సాయికుమార్ తన స్నేహితుడు అయిన రెడ్డిపల్లికి చెందిన అజయ్‌కుమార్‌తో కలిసి స్వగ్రామానికి బయలుదేరాడు. తాడిపత్రి రహదారిపై డివైడర్ ఢీకొన్నారు. అజయ్‌కుమార్‌కు తలకు తీవ్రగాయాలయ్యాయి. సాయికుమార్ గాయపడ్డాడు. స్థానికులు వారిని 108లో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

శివపురం పెద్దమ్మ హుండీ ఆదాయం రూ.2.72 లక్షలు


హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

శింగనమల: శివపురంలో అనంతపురం–తాడిపత్రి రోడ్డు పక్కనున్న పెద్దమ్మ ఆలయ హుండీ కానుకలను గురువారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులు లెక్కించారు. ప్రతి రెండు నెలలు ఒక్కసారి హుండీ కానుకలు లెక్కిస్తున్నారు. ఈరోజు చేపట్టిన లెక్కింపులో రూ.2,72,649 వచ్చినట్లు ఆలయ ఈఓ శోభ తెలిపారు. కార్యక్రమంలో తాడిపత్రి దేవాదాయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

గుంతకల్లుటౌన్: పట్టణంలని అతిపురాతనమైన కోదండరామస్వామి ఆలయ హుండీ కానుకలను గురువారం లెక్కించారు. హుండీల లెక్కింపు ద్వారా ఆలయానికి రూ.89,284 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ మతం మల్లికార్జున తెలిపారు. జిల్లా దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ రామతులసి, ఆలయ అర్చకులు, హనుమాన్ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తిమ్మనచెర్లలోని రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకలను లెక్కించారు. వాటి ద్వారా రూ.36,282 ఆదాయం లభించినట్లు ఈఓ మల్లికార్జున పేర్కొన్నారు.


కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

ప్రశాంతంగా సీనియర్ ఇంటర్ పరీక్ష

పామిడి: పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటిరోజు పరీక్షకు సంబంధించి 342 మంది విద్యార్థులకు గాను 336 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలకు చీఫ్‌గా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా నాగరాజు వ్యవహరించారు. పరీక్షా కేంద్రం వద్ద సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ షేక్ చాంద్‌బాషా, పోలీసులు బందోబస్తు చేపట్టారు.

యాడికి: స్థానిక మోడల్ కళాశాలలో గురువారం జరిగిన ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షకు ఒకరు హాజరు కాలేదు. సెంటర్‌లోని 153 మందిలో నలుగురు సంస్కృతం పరీక్ష రాయగా మిగిలిన 148 మంది తెలుగు పరీక్ష రాసినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ మారుతి, డీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు.

అశ్వవాహనంపై వేంకటేశ్వరుడు

యల్లనూరు: మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి వెంకన్న అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రధాన అర్చకుడు విజయ్ భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.


అలంకరణలో వెంకన్న

గాయపడిన నగరపాలక సంస్థ కమిషనర్

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో కమిషనర్ కే భాగ్యలక్ష్మి ప్రమాదవశాత్తూ గాయపడ్డారు. గురువారం ఆమె నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్ నుంచి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్తుండగా, రెవెన్యూ విభాగం సమీపంలో మెట్లు దిగుతుండగా ఎడమ కాలు బెణికింది. కిందపడిపోయిన ఆమెను డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు సంపంగి రామాంజనేయులు, అనిల్ కుమార్ రెడ్డి, సీసీ ఉదయ్‌కుమార్ రెడ్డి వీల్‌చైర్‌పై కార్యాలయం ఆవరణలోకి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నగరంలోని ఓ ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కమిషనర్‌కు కాలు ఫ్యాక్చర్ అయినట్లు తెలిసింది. సర్జరీ చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పినట్లు నగరపాలక సంస్థ కార్యాలయ వర్గాలు తెలిపాయి. మేయర్ వసీం కమిషనర్‌ను ఆస్పత్రిలో పరామర్శించారు. అధికారులు, కార్పొరేటర్లు కమిషనర్‌ను పరామర్శించారు.

ఉద్యోగాలకు ఎంపిక

తాడిపత్రి టౌన్ : తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాలలో క్యూ స్పిడర్స్ కంపెనీకి యాజమాన్యం గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలో ఫైనలియర్ విద్యార్థులు పది మంది అత్యత ప్రతిభ కనపరచి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఒక్కొక్కరికి రూ.4 లక్షల వార్షిక వేతనం లభించనుంది. ఈసందర్భంగా ఉద్యోగాలకు ఎంపికై న వారిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సుబ్బారెడ్డి, కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ భానుప్రసాద్, కరస్పాండెంట్ ఆశోక్‌కుమార్‌రెడ్డి అభినందించారు.


అధ్యాపకులతో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

సిద్దిబాషా ఉరుసు ప్రారంభం

తాడిపత్రి టౌన్: స్థానిక అశోక్ పిల్లర్ సర్కిల్ సమీపంలోని హజరత్ సిద్దిబాషా ధర్గా ఉరుసు ప్రారంభమైంది. మొదటి రోజైన గురువారం రాత్రి గంధం ఉత్సవాలు నిర్వహించారు. సిద్దిబాషా దర్గాను విద్యుద్ దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలకరించారు. ముస్లింలు చెక్కర చదివింపులు చేయించడంతోపాటు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

గాలికుంటు టీకా వేయించండి

గుంతకల్లు రూరల్: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం వేస్తున్న టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి మహేష్ తెలిపారు. గురువారం తిమ్మాపురం, నక్కనదొడ్డి గ్రామాల్లో ఆవులు, ఎద్దులు, గేదెలకు గాలికుంటు వ్యాధి టీకాలలు వేశారు. ఈసందర్భంగా డాక్టర్ మహేష్ మాట్లాడుతూ పశువులకు నోట్లోనూ, చిగుళ్లకు పుండ్లు కావడం, కాలి గిట్టలకు గాయాలు కావడం, తీవ్రమైన జ్వరం రావడం వంటివి గాలికుంటు వ్యాధి లక్షణాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే పశువుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. మొదటిరోజు 340 ఆవులు, ఎద్దులు, 200 పైగా గేదెలకు టీకాలను వేసినట్లు ఆయన తెలిపారు. అంతకుముందు తిమ్మాపురం సర్పంచ్ నీలమ్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

క్యాన్సర్ రోగికి సాయం


నగదు అందిస్తున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి టౌన్: స్థానిక పడమర గేరి ఐదో నెంబర్ బీడి పరిశ్రమలో గురువారం అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రంకు చెందిన క్యాన్సర్ రోగి మహబూబ్‌పీరా కుమార్తెకు రూ.20 వేల నగదును ఫయాజ్‌బాషా ట్రస్ట్ చైర్మన్ ఫయాజ్‌బాషా అందజేశారు. మహబూబ్ పీరా కొన్ని సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆయన కుటుంబ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తమ వంతుగా ఆర్థికసాయం అందించినట్లు ఫయాజ్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు షాషావలి, ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, అస్లాం , గురప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ వేల్పూరికి సన్మానం


డాక్టర్ ప్రభాకర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలో 100 ఉచిత దంత వైద్యశిబిరాలను నిర్వహించి ప్రజల మన్ననలను పొందిన ప్రముఖ దంతవైద్యనిపుణులు డాక్టర్ వేల్పూరి ప్రభాకర్‌ను అవోపా నాయకులు సన్మానించారు. అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని గురువారం శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర్‌ను అవోపా పెద్దలు శాలువా, పూలమాలతో సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అవోపా, ఆర్యవైశ్య సంఘం నాయకులు గోపాజగదీష్, కౌన్సిలర్ కృపాకర్, చెన్నకేశవులు, రమణ, వేణు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్‌కు ఆస్కార్‌పై సంబరాలు


గుత్తి కోట రైల్వే స్టేషన్‌లో ఆనందం వ్యక్తం చేస్తున్న దృశ్యం


గుత్తి: గుత్తి కోట రైల్వే స్టేషన్‌లో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ ఆధ్వర్యంలో ఆర్ఆర్ఆర్‌లోని నాటునాటు పాటకు ఆస్కార్ రావడంతో గురువారం సంబరాలు నిర్వహించారు. షార్ట్ ఫిల్మ్ హీరోలు విజయభాస్కర్, ఉండ్రా శివ, స్వాతంత్య్ర సమర యోధుడు సూర్యనారాయణరెడ్డి, జేవీవీ నాయకులు వెంకటరామిరెడ్డి, గుత్తి కోట గైడ్ రమేష్ తదితరులు సంబరాలు జరిపారు. ఆర్ఆర్ఆర్‌కు ఆస్కార్ రావడం యావత్తు దేశం గర్వించదగ్గ విషయమన్నారు. తెలుగు వాడి సత్తాను ఖండంతరాలకు తీసుకెళ్లిన మూవీ ఆర్ఆర్ఆర్ అన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు రాజమౌళి, సంగీత దర్శకులు కీరవాణి, పాట రచయిత చంద్రబోస్, హీరోలు రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ తదితరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు


గుత్తిలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు


యాడికిలో..


తాడిపత్రి టౌన్: పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా


అమరజీవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాగేశ్వరప్ప

గుత్తి: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద గురువారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఆర్యవైశ్య, యువజన సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పొట్టి శ్రీరాములు త్యాగాన్ని, సేవలను కొనియాడారు. ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు పచ్చిపులుసు లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి నాగ సుదర్శన్, యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ కుమార్, వెంకటేష్, కోశాధికారి వెంకట్ పాల్గొన్నారు.

యాడికి: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు అందరికీ ఆదర్శమని ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు గాధంశెట్టి బలరామయ్య అన్నారు. గురువారం పంచాయతీ కార్యాలయం ఎదుటనున్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్యులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పవన్‌కుమార్, విశ్వనాథ్, రాము, లక్ష్మినారాయణ, ప్రదీప్, మారుతి, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, శేఖర్, రవితేజ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్: స్థానిక గాంధీ సర్కిల్‌లో గురువారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకులు ఘనంగా జరిగాయి. మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్, సంఘం కార్యదర్శి అశ్వత్థ రంగయ్య, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో అమరజీవి జయంతి వేడుకలు జరిగాయి. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన సేవలు మరువలేనివని ఏపీఎస్పీ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప పేర్కొన్నారు. గురువారం జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బెటాలియన్ డీఎస్పీ రమణమూర్తి, ఏఓ నాగభూషణమ్మ, డాక్టర్ కౌసర్ బేగం, వివేకానంద ఆర్ఐ లోకేశ్వర నాయుడు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలం పరిశీలన

పుట్లూరు: మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో శ్మశాన వాటిక స్థలాన్ని గురువారం ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. శ్మశాన వాటిక స్థలం వివాదంపై గతంలో మండల అధికారులు గ్రామంలో పర్యటించినా వివాదం కొనసాగడంపై ఆయన ఆరా తీశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని స్థానికులకు సూచించారు.